శాకంబరిగా మోదకొండమ్మ



శాకంబరి అలంకరణలో మోదకొండమ్మ అమ్మవారు

శాకంబరి అలంకరణలో మాడుగుల మోదకొండమ్మ అమ్మవారు మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. - మాడుగుల

ఎమ్మెల్సీ ఎన్నికకు రంగం సిద్ధం

షెడ్యూల్ విడుదల

- వచ్చే నెల 6న నోటిఫికేషన్
- 13వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరణ
- 30న పోలింగ్
- సెప్టెంబరు 3న ఓట్ల లెక్కింపు
- విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో అమలులోకి ఎన్నికల కోడ్
- బదిలీలు, శంకుస్థాపనలకు బ్రేక్

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ పదవి (స్థానిక సంస్థల కోటా)కి ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ ప్రకటించింది. మూడేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మెజారిటీ స్థానాలను వైసీపీ గెలుచుకుంది. ఈ నేపథ్యంలో 2021 డిసెంబరులో స్థానిక సంస్థల కోటాలో రెండు ఎమ్మెల్సీ పదవులు ఖాళీ కాగా వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి ఎన్నికయ్యారు. అయితే వంశీకృష్ణ గత ఏడాది నవంబరులో వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. పార్టీ ఫిరాయింపు పేరుతో వంశీకృష్ణ శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ పదవికి అనర్హుడిగా శాసన మండలి చైర్మన్ ప్రకటించారు. ఆ స్థానంలో మరొకరిని ఎంపిక చేయాల్సి ఉంది. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రజాపరిషత్ సభ్యులు కలిసి ఎమ్మెల్సీని ఎన్నుకోవలసి ఉంది. దీనికి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మంగళవారం షెడ్యూల్ విడుదల చేశారు. ఆగస్టు 6వ తేదీన ఎన్నిక నోటిఫికేషన్ జారీచేస్తారు. ఆగస్టు 13వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 14న వాటిని పరిశీలిస్తారు. నామినేషన్ ఉపసంహరణకు 16వ తేదీ వరకు గడువు ఉంటుంది. అదే నెల 30వ తేదీన పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. సెప్టెంబరు 3వ తేదీన ఓట్లను లెక్కిస్తారు. సెప్టెంబరు 6వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని ఎన్నికల అధికారి అయిన విశాఖపట్నం జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ ఎన్నికలలో ఎవరు గెలిచినా వారి పదవీ కాలం 2027 డిసెంబరు ఒకటో తేదీ వరకు ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ మంగళవారం విడుదల చేసినందున ఎన్నికల కోడ్ మూడు జిల్లాలలోను అమలులో ఉంటుందని కలెక్టర్ స్పష్టంచేశారు. కోడ్ ముగిసేంత వరకూ ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు ఉండవు. అలాగే అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు ఉండవు.

రహదారి విస్తరణ కలేనా?

ఎలమంచిలి - గాజువాక రోడ్డు అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు

- వైసీపీ పాలనలో అటకెక్కిన వైనం
- తరచూ స్తంభిస్తున్న ట్రాఫిక్
- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు



సినిమాహాల్ జంక్షన్ సమీపంలో స్తంభించిన ట్రాఫిక్(ఫైల్)

పరవాడ, జూలై 30: పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్న పరవాడ, అచ్యుతాపురం మండలాలకు ముఖ్య మార్గమైన ఎలమంచిలి -గాజువాక ప్రధాన రహదారి విస్తరణ ఏళ్ల తరబడి ప్రతిపాదనలకే పరిమితమైంది. ఎన్టీపీసీ, ప్రత్యేక ఆర్థిక మండలి, బార్క్ తదితర సంస్థలు ఏర్పాటు కాకముందు ఈ రహదారి ఎంత వెడల్పు ఉందో ఇప్పటికీ అంతే ఉంది. వాహనాల రద్దీ మాత్రం పది రెట్లు పెరిగింది. నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తుండడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పరవాడ మండలంలో ఎన్టీపీసీ, అచ్యుతాపురం మండలంలోని ప్రత్యేక ఆర్థిక మండలిలోని కంపెనీలు, బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్(బార్క్), రాంబిల్లి మండలంలో ఏర్పాటవుతున్న ప్రత్యామ్నాయ నావికాదళ స్థావరం (ఏఎన్ఓబీ) తదితర వాటికి నిత్యం వందలాది భారీ వాహనాలు ఎలమంచిలి -గాజువాక ప్రధాన రహదారి గుండానే రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ సంస్థలు, కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు నిత్యం ఇతర ప్రాంతాల నుంచి వాహనాల్లో వస్తుంటారు. మరో వైపు తంతడి బీచ్, ముత్యాలమ్మపాలెం బీచ్, కొండకర్ల ఆవ వంటి పర్యాటక ప్రదేశాలకు సందర్శకులు అధికంగా వస్తుంటారు. మొత్తం మీద పరవాడ నుంచి రాంబిల్లి మండలం వెంకటాపురం వరకు వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో జాతీయ రహదారిలో లంకెలపాలెం నుంచి పరవాడ మండల పరిషత్ జంక్షన్ మీదుగా ఎలమంచిలి వరకు రహదారి విస్తరణకు 2018లో టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇది కార్యరూపం దాల్చే సమయానికి ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్డు విస్తరణకు ఎటువంటి కదలిక లేకపోయింది. మరో వైపు రహదారి విస్తరణ పేరుతో రోడ్డు నిర్వహణ పనులను ఆర్ అండ్ బీ అధికారులు పూర్తిగా విస్మరించారు. కనీసం గోతులు కూడా పూడ్చడం లేదు. వర్షాలతో గోతుల్లో నీరు చేరి వాహనాల రాకపోకలతో మరింత పెద్దవి అవుతున్నాయి. పరవాడ సినిమాహాల్ జంక్షన్, బొట్టవానిపాలెం జంక్షన్, ధర్మారాయుడుపేట జంక్షన్ వద్ద రహదారి పూర్తిగా దెబ్బతింది. ఈ మార్గంలో రాత్రి పూట ప్రయాణించాలంటే ద్విచక్ర వాహనదారులు హడలిపోతున్నారు. పలుచోట్ల వాహనాలు తప్పించుకునే వీల్లేనంతగా రోడ్డు మొత్తం భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో తరచూ ట్రాఫిక్ స్తంభించడం, ప్రయాణ సమయం రెట్టింపు కావడం, ప్రమాదాలు పెరిగిపోవడం, వాహనాలు విడిభాగాలు దెబ్బతినడం వంటివి జరుగుతున్నాయి. అచ్యుతాపురం సెజ్‌లో ఏర్పాటవుతున్న పరిశ్రమలకు ఇతర ప్రాంతాల నుంచి భారీ యంత్ర సామగ్రిని రప్పిస్తుంటారు. ఇవి చాలా వెడల్పుగా ఉండడంతో రోడ్డు మొత్తం ఆక్రమించి ఎదురుగా వస్తున్న వాహనాలు తప్పుకునేందుకు కష్టతరమవుతోంది. అంతేకాక భారీ వాహనాలు నెమ్మదిగా వెళ్లాల్సి రావడంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు ఓవర్‌టేక్ చేయడానికి వీలు కావడం లేదు. ఇటువంటి సమయాల్లో ట్రాఫిక్ స్తంభిస్తుంది. ఈ మార్గంలో ఉదయం ఏడు నుంచి పది గంటల వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు, సాయంత్రం ఐదు నుంచి రాత్రి 11 గంటల వరకు వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. దీంతో పరవాడ మండల పరిషత్ జంక్షన్, ఎన్టీపీసీ జంక్షన్ (ఊటగెడ్డ ప్రాంతం) అత్యంత రద్దీగా మారి తరచూ ట్రాఫిక్ స్తంభిస్తుంది. దీంతో ఉద్యోగులు, కార్మికులు సకాలంలో విధులకు హాజరుకాలేని పరిస్థితి నెలకొంటోంది. కూటమి ప్రభుత్వం స్పందించి లంకెలపాలెం నుంచి పరవాడ, అచ్యుతాపురం మీదుగా ఎలమంచిలి వరకు రహదారి విస్తరణ పనులు సత్వరమే చేపట్టాలని వాహనదారులు, పరవాడ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



స్థానిక టీ రాజా సమీపంలో నిలిచిపోయిన ట్రాఫిక్(ఫైల్)

తక్షణమే రోడ్డు విస్తరణ చేపట్టాలి



ఎలమంచిలి- గాజువాక ప్రధాన రహదారిలో వాహనాల రద్దీ గణనీయంగా పెరిగింది. రహదారిని విస్తరించకపోవడం, సమీప నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో తరచూ ట్రాఫిక్ స్తంభించి ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి వేళ ద్విచక్ర వాహనాలపై వెళ్లాలంటే భయమేస్తుంది. రహదారి ఇరుకుగా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారిని యుద్ధప్రాతిపదికన విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కూటమి ప్రభుత్వం సత్వరమే చర్యలు చేపట్టాలి. - రొంగలి నాగేశ్, తానాం

సామాజిక పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం

జిల్లాలో లబ్ధిదారులు 2,62,624 మంది

- రూ.108.41 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- 1వ తేదీ ఉదయం నుంచి సచివాలయ సిబ్బందితో పంపిణీకి చర్యలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీకి జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. గత నెలలో మాదిరిగా ఆగస్టు 1వ తేదీ ఉదయం నుంచి గ్రామ సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఆగస్టు 1వ తేదీ సాయంత్రానికి 99 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేయాలని, సాంకేతిక కారణాల వల్ల తొలిరోజు అందనివారికి 2వ తేదీన అందజేసి, నూరు శాతం పంపిణీ పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ అయ్యాయి. జిల్లాలో 522 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని అన్ని కేడర్ల ఉద్యోగులు పింఛన్ల పంపిణీలో పాల్గొననున్నారు. జిల్లాలో 2,62,624 మంది వివిధ రకాల పింఛన్ లబ్ధిదారులున్నారు. వీరి కోసం ప్రభుత్వం రూ.108.41 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టేందుకు కలెక్టర్ విజయకృష్ణన్ ఇప్పటికే డీఆర్‌డీఏ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పింఛన్ల పంపిణీ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారని అధికారులు తెలిపారు.

రసవత్తరంగా స్టాండింగ్ కమిటీ ఎన్నిక



కూటమి, వైసీపీ మధ్య పోటాపోటీ

- పది స్థానాలకు ఇరుపక్షాల నుంచి పదేసి మంది నామినేషన్
- జీవీఎంసీలో గల 97 మంది కార్పొరేటర్లకు ఓటు హక్కు
- గెలుపునకు 49 ఓట్లు అవసరం
- ప్రస్తుతం వైసీపీకి 48, కూటమికి 47 మంది మద్దతు
- అవకాశం దక్కని కొందరిలో అసంతృప్తి
- ఇరువర్గాల్లోనూ క్రాస్ ఓటింగ్ గుబులు
- కూటమి వైపు మరికొందరు వైసీపీ కార్పొరేటర్ల చూపు
- వచ్చే నెల ఏడున పోలింగ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ముగిసింది. వచ్చే నెల ఏడున పోలింగ్ జరగనున్నది. పది స్థానాలు ఉండగా కూటమి నుంచి పది మంది, వైసీపీ నుంచి పది మంది కార్పొరేటర్లు పోటీలో నిలిచారు. గెలుపునకు 49 మంది కార్పొరేటర్ల మద్దతు అవసరం కాగా...ఇరుపక్షాలు ప్రస్తుతం సమాన బలంతో ఉన్నాయి. అయితే ఇరుపక్షాల్లోని కార్పొరేటర్లలో కొందరు అసంతృప్తితో రగిలిపోతుండడంతో క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశం లేకపోలేదనే ప్రచారం జరుగుతోంది.

స్టాండింగ్ కమిటీ ఎన్నిక రసవత్తరంగా మారింది. కమిటీలో పది స్థానాలకు వచ్చే నెల ఏడున పోలింగ్ జరపాలని జీవీఎంసీ అధికారులు నిర్ణయించారు. దీనికోసం మంగళవారంతో ... మిగతా 8వ పేజీలో

స్టాండింగ్ కమిటీకి 20 నామినేషన్లు

- టీడీపీ నుంచి 10 మంది, వైసీపీ నుంచి 10 మంది పోటీ
- నేడు నామినేషన్ల పరిశీలన

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీకి 20 మంది కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేసినట్టు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఆఖరు రోజైన మంగళవారం ఐదుగురు నామినేషన్లు దాఖలైనట్టు వివరించారు. నామినేషన్లు దాఖలు చేసిన వారిలో టీడీపీకి చెందిన కార్పొరేటర్లు పది మంది, వైసీపీ నుంచి పది మంది ఉన్నారన్నారు. కూటమి తరపున టీడీపీకి చెందిన నొల్లి నూకరత్న (19వ వార్డు), గల్లా పోలిపల్లి (63వ వార్డు), శరగడం రాజశేఖర్ (56వ వార్డు), బొమ్మిడి రమణ (90వ వార్డు), గొలగాని వీరారావు (27వ వార్డు), పిసిని వరహానరసింహం (98వ వార్డు), పులి లక్ష్మీబాయి (75వ వార్డు), బల్ల శ్రీనివాసరావు (94వ వార్డు), పిళ్లా మంగమ్మ (7వ వార్డు)తోపాటు ఇండిపెండెంట్‌గా గెలిచి ఇటీవల టీడీపీలో చేరిన విల్లూరి భాస్కరరావు (35వ వార్డు) నామినేషన్లు దాఖలు చేశారన్నారు. వైసీపీ నుంచి అక్కరమాని రోహిణి (12వ వార్డు), రెయ్యి వెంకటరమణ (51వ వార్డు), మహ్మద్ ఇమ్రాన్ (66వ వార్డు), బిపిన్‌కుమార్‌జైన్ (31వ వార్డు), ముర్రువాణి (57వ వార్డు), సాడి పద్మారెడ్డి (24వ వార్డు), నక్కెల్ల లక్ష్మి (20వ వార్డు), తోట పద్మావతి (34వ వార్డు), కరజాడ వెంకటనాగ శశికళ (55వ వార్డు), పల్లా అప్పలకొండ (28వ వార్డు) నామినేషన్ వేశారన్నారు. వీరి నామినేషన్లను బుధవారం పరిశీలిస్తామని కమిషనర్ తెలిపారు. వచ్చే నెల ఏడో తేదీన ఎన్నిక జరగనున్నది.

అడ్డూరులో దారుణం

అత్తమామలపై కత్తితో అల్లుడి దాడి

- అత్త మృతి, తీవ్రగాయాలతో మామ ఆస్పత్రిపాలు
- ఏమీ తెలియనట్టు మామను కేజీహెచ్‌లో చేర్పించిన వైనం
- వైద్యులిచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు
- ఇంట్లో రక్తపు మడుగులో ఉన్న అత్త మృతదేహం గుర్తింపు

- వార్త మెయిన్‌లో..

వరల్డ్ క్లాస్ యూనివర్సిటీగా ఏయూ

ఆ దిశగా దృష్టి పెట్టాలని అధికారులకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ ఆదేశం

- ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని మోడల్‌గా తయారు చేస్తే దాన్ని అన్ని విశ్వవిద్యాయాల్లో అమలు చేస్తాం
- నైపుణ్యాల పెంపును విద్యలో అంతర్భాగం చేయాలి
- ఇండస్ట్రీ ల్యాబ్స్ స్థాపించాలి
- విద్యా సంస్థల్లో మత్తు పదార్థాల వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు

- 7లో

కౌన్సిల్ గరంగరం

వీధి దీపాల నిర్వహణ అధ్వానం

- పగలు వెలుగుతాయి... రాత్రి వెలగవు
- పారిశుధ్యం ఘోరం
- టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ధ్వజం
- అర్బన్ పీహెచ్‌సీ భవన నిర్మాణం నాణ్యతపై అసంతృప్తి
- పని చేయని ఎక్స్‌కవేటర్‌కి డీజిల్ ఖర్చు ఎందుకు చూపించారని జనసేన కౌన్సిలర్ నిలదీత



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చింతకాయల పద్మావతి, (ఇన్‌సెట్‌లో) మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి

నర్సీపట్నం, జూలై 30: మునిసిపాలిటీలో వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా ఉందని, పగలు వెలుగుతాయని, రాత్రి పూట వెలగవని టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ధ్వజమెత్తారు. మంగళవారం మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన పట్టణ పోలీసులు బందోబస్తు మధ్య కౌన్సిల్ సమావేశం జరిగింది. ముందుగా వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ మునిసిపాటీలో పారిశుధ్య విభాగంలో ఉపయోగించే వాహనాలు ఎన్ని ఉన్నాయి?, వాటిలో అద్దె వాహనాలు ఎన్ని?, రిపేరులో ఎన్ని ఉన్నాయని ప్రశ్నించారు. 26వ వార్డు టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి మాట్లాడుతూ మూడేళ్లుగా కౌన్సిల్ సమావేశంలో పారిశుధ్య సమస్యపై మాట్లాడుతున్నామని, కానీ పరిష్కారం కాలేదన్నారు. పాలకవర్గంలో ఉండి చెత్త వాహనాలు ఎందుకు బాగుచేయించలేక పోయారని పద్మావతి నిలదీశారు. వార్డుల్లో పందులు బెడద, చెత్త పేరుకుపోయి ప్రజలు డెంగ్యూ జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఏడో వార్డులో అర్బన్ పీహెచ్‌సీ భవనం నాణ్యత లేకుండా నిర్మించారని, కనీస సౌకర్యాలు లేవన్నారు. మునిసిపాలిటీని ఎక్కడికి తీసుకుపోతున్నారని అధికారులను నిలదీశారు. మునిసిపాలిటీకి వచ్చిన ఆదాయం అంతా ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రతి నెలా లక్షల రూపాయలు మింగేస్తున్నారని ఆరోపించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌పై సమీక్ష చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 28 వార్డులలో అభివృద్ధి పనులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు రూ.4 కోట్లు మంజూరు చేయించారని వెల్లడించారు. 24వ వార్డు టీడీపీ కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు మాట్లాడుతూ మునిసిపాలిటిని భ్రష్టు పట్టించారని విమర్శించారు. 28వ వార్డు టీడీపీ కౌన్సిలర్ డబ్బీరు శ్రీకాంత్ మాట్లాడుతూ అయ్యన్న కాలనీలో డ్రైనేజీ సమస్య కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకు వెళ్లినా పరిష్కరించలేదని విమర్శించారు. 22వ వార్డు టీడీపీ కౌన్సిలర్ పెదిరెడ్ల దివ్య మాట్లాడుతూ వెంకునాయుడుపేట ఎంపీపీ స్కూల్ ఆనుకొని వాటర్ ట్యాంక్ ... మిగతా 8వ పేజీలో

రావణాపల్లి రిజర్వాయర్ అభివృద్ధికి త్వరలో నిధులు మంజూరు

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు



రావణాపల్లి రిజర్వాయర్ వద్ద గండి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గొలుగొండ, జూలై 30: త్వరలో రావణాపల్లి రిజర్వాయర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని నర్సీపట్నం ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. మండలంలోని రావణాపల్లి రిజర్వాయర్ గట్టు గండి పడడంతో ఇసుక బస్తాలతో పూడ్చిన ప్రాంతాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. రిజర్వాయర్‌కు సంబంధించిన వివరాలను స్థానిక నాయకులు, రైతులు, ఇరిగేషన్ ఈఈని అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానికులు ముందుగా గట్టు గండిని గుర్తించడంతో ప్రమాదం తప్పిందన్నారు. రిజర్వాయర్ గండి ప్రమాదంపై కలెక్టర్‌తో ఇప్పటికే మాట్లాడామన్నారు. రావణాపల్లి రిజర్వాయర్ నర్సీపట్నం, గొలుగొండ మండలాలకు చెందిన సుమారు మూడు వేల ఎకరాలకు ఏటా సాగునీరు అందిస్తుందన్నారు. 2017 సంవత్సరంలో ఎన్టీసీపీ, నీరు-చెట్టు నిధులు సుమారు రూ.1.8 కోట్లతో రిజర్వాయర్‌లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అప్పటి నుంచి గత ప్రభుత్వ హయాంలో ఒక్క రూపాయి కూడా రిజర్వాయర్ అభివృద్ధికి కేటాయించలేదన్నారు. గేట్లు, కుడి, ఎడమ కాలువల మదాలు మరమ్మతులకు గురవుతున్నా కనీసం గత ప్రభుత్వ హయాంలో పట్టించుకోలేదన్నారు. అయితే గండి పూడ్చినప్పటికీ రిజర్వాయర్ పరిస్థితిపై ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు అప్రమత్తంగా వుండాలని ఆదేశించారు. దీనికి సంబంధించి మదాలు, పొర్లు కట్టు కుడి, ఎడమ కాలువల అభివృద్ధికి నిధులు ఎంత అవసరమో ప్రతిపాదనలను త్వరితగతిన సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్‌లో పొర్లు గట్టుకు అడ్డంగా చేపలు బయటకు పోకుండా ఏర్పాటు చేసిన ఇనుప కంచెను తక్షణం తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో జయరాం, ఇరిగేషన్ ఈఈ స్వామినాయుడు, మండల జేఈ సూర్యనారాయణ, ఇన్‌చార్జి తహసీల్దార్ భరత్‌కుమార్, టీడీపీ గొలుగొండ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, స్థానిక సర్పంచ్ కొల్లి సత్యనారాయణ, టీడీపీ మండల తెలుగు యువత అధ్యక్షుడు కర్రి నాయుడు, టీడీపీ నాయకులు కొల్లి రాంబాబు, భీమిరెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

పాము కాటుకు గిరిజనుడి మృతి


రాజారావు (ఫైల్)

జి.మాడుగుల, జూలై 30: మండలంలోని గెమ్మెలి పంచాయతీ పొత్తడిగొంది గ్రామానికి చెందిన జన్ని రాజారావు (40) పాముకాటుకు గురై సోమవారం సాయంత్రం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం రాజారావు పొలం పనులకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చాడు. పొయ్యిలో కట్టెలు కోసం ఇంటి వెనుకల భాగంలో వెళ్లగా అక్కడ నాగు పాము కాటు వేసింది. ఇది చూసిన పక్కింటి వారు కుటుంబీకులకు సమాచారం అందించారు. హుటాహుటిన గెమ్మెలి పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు వదిలాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

చిట్ నిర్వాహకుడిపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, జూలై 30: చీటీ డబ్బులు చెల్లించని నిర్వాహకుడిపై సోమవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్‌ఐ వి.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. పట్టణానికి చెందిన కాంతారావు అనే వ్యక్తి లక్ష్మీగణపతి లక్కీస్కీమ్ పేరుతో చీటీలు వేశారన్నారు. కుంచావారివీధికి చెందిన వి.మల్లికార్జునరావు తన ఇద్దరు పిల్లలు తరపున 2022 అక్టోబరు నుంచి ఒక్కొక్కరి పేరును నెలకు రూ. 1500లు చొప్పున 33 నెలలు చీటీ కట్టారన్నారు. సమయం మించిపోయినా తనకు రావాల్సిన రూ.లక్షా 20 వేలు చెల్లించలేదని నిర్వాహకుడు కాంతారావుపై బాధితుడు మల్లికార్జునరావు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తిపై కేసు

అనకాపల్లి టౌన్, జూలై 30: ఉద్యోగం ఇప్పిస్తానని రూ.మూడు లక్షలు తీసుకుని తనను మోసం చేశాడంటూ విశాఖకు చెందిన సన్యాచారిపై తుమ్మపాలకు చెందిన కోనా వరహా నరసింహమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి పట్టణ ఎస్‌ఐ మహ్మద్ అలీ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. తుమ్మపాలకు చెందిన నరసింహమూర్తి తన మేనల్లుడికి ఉద్యోగం కోసం 2021 మార్చి మూడో తేదీన విశాఖపట్నానికి చెందిన సన్యాచారికి రూ.3 లక్షలు ఇచ్చారు. అయితే ఇప్పటికి ఉద్యోగం ఇప్పించకపోగా, తాను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని నరసింహమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ అలీ తెలిపారు.

10 మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి టౌన్, జూలై 30: స్థానిక రింగురోడ్డులో ఓ వ్యక్తి నుంచి సోమవారం రాత్రి పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. మునగపాకకు చెందిన దొడ్డి వెంకటరమణ పట్టణంలోని మద్యం దుకాణంలో పది మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి స్వగ్రామానికి వెళుతుండగా అనుమానం వచ్చి రింగురోడ్డు జంక్షన్ వద్ద తనిఖీ చేయగా మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయని, ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఎలుకల మందు పిచికారీ చేసిన చేతితో ఆహార పదార్థాలు తిన్న యువకుడి మృతి

కొత్తూరు, జూలై 30 : ఎలుకల మందు పిచికారీ చేసిన చేతితో ఆహారపదార్థాలు తిన్న యువకుడు విశాఖ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ తేజేశ్వరరావు తెలిపారు. అనకాపల్లి మండలం సీతానగరం గ్రామానికి చెందిన గంగుపాం దిలీప్‌కుమార్ (28) తన నివాసంలో ఉన్న ధాన్యం తినేస్తున్నాయని సోమవారం రాత్రి ఎలుకల నివారణ మందు చేతితో కలిపి పెట్టాడు. అయితే అదే చేతితో ఆహార పదార్థాలు తినడంతో దిలీప్‌కుమార్ అపస్మారక స్థితిలో పడిపోయాడన్నారు. దీంతో హుటాహుటీన అతనిని అనకాపల్లిలో ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నంలో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్టు అతని తండ్రి తాతారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తేజేశ్వరరావు చెప్పారు.

వరల్డ్ క్లాస్ యూనివర్సిటీగా ఏయూ

అధికారులకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ ఆదేశం


ఏయూలో పర్యటిస్తున్న ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్

విశాఖపట్నం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఏయూను వరల్డ్ క్లాస్ యూని వర్సిటీగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ సూచించారు. మంగళవారం విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన ఆయన పాలకమండలి సమావేశ మందిరంలో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావుతోపాటు వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నైపుణ్య శిక్షణను విద్యలో అంతర్భాగం చేయాలని సూచించారు. వర్సిటీలోని ప్రతి విభాగం లో ఇండస్ట్రీ ల్యాబ్‌ను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. నైపుణ్యాభివృద్ధి రంగంలో పనిచేస్తున్న విభిన్నశాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రవేశాల ప్రక్రియ, వార్షిక క్యాలెండర్, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పన, విభాగాలు, ప్రాజెక్టులు, సీఈవోల పనితీరును పరిశీలించడానికి తాను వచ్చినట్టు చెప్పారు. రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలను దేశంలోనే అత్యుత్తమ విద్యా సంస్థలుగా తీర్చిదిద్దాల ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యా శాఖా మంత్రి లోకేశ్ ఆలోచన చేస్తున్నారని వివరించారు. దేశంలో తొలి 50 స్థానాల్లో రాష్ట్ర విశ్వవిద్యాలయాలు ఉండేలా ప్రణాళికాయుతంగా పనిచేస్తామన్నారు. సమాజంలో ఉన్న అవకాశాలను యువతకు వివరించాలని, విశాఖలో ఉన్న వివిధ ఇంక్యుబేషన్ కేంద్రాలు, ఎస్‌టీపీఐ సంస్థలతో పరిశోధకులను అనుసంధానం చేయాలని సూచించారు. ఏయూను మోడల్‌గా తయారుచేస్తే దాన్ని రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాయాల్లో అమలు చేస్తామని స్పష్టంచేశారు. పేపర్ లెస్‌వర్సిటీగా ఏయూను తీర్చిదిద్దాలని సూచించారు. విద్యా సంస్థల్లో మత్తు పదార్థాల వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ పి.ఉమామహేశ్వరిదేవి, వివిధ విభాగాలకు చెందిన అధికారులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.అంతకుముందు ఏయూ మెరైన్ లివింగ్ రీసోర్సెస్ సెంటర్‌లో అవంతి స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌ను సౌరబ్ గౌర్ సందర్శించారు.

గత వీసీ హయాంలో అవకతవకలపై చర్యలు

అనంతరం మీడియాతో మాట్లాడిన సౌరబ్ గౌర్ గత వీసీ హయాంలో జరిగిన అవకతవకలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయని, వీటిపై చర్యలు తీసుకుంటామన్నారు. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల నియామకాన్ని ప్రాధాన్యత అంశంగా పెట్టుకున్నట్టు వివరించారు. రెగ్యులర్ వైస్‌చాన్సలర్ల నియామకానికి ప్రణాళికలు తయారు చేస్తున్నట్టు వివరించారు. ఏయూను మరింత బలోపేతం చేస్తామన్నారు. ఏయూలో 58 విభాగాలు, పది సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయనకు గత వీసీ అక్రమాలు, అన్యాయాలపై పలువురు ఫిర్యాదులు చేశారు.

ఫిర్యాదు చేసిన అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్

ఏయూ అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్ ఆధ్వర్యంలో సౌరబ్ గౌర్‌ను కలిసిన పలువురు పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. కృష్ణా యూనివర్సిటీ నుంచి, ఎయిడెడ్ కాలేజీల నుంచి వచ్చిన ఫ్యాకల్టీని వెనక్కి పంపించాలని కోరారు. అనైతికంగా, అడ్డగోలుగా జగన్మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన బదిలీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అధ్యాపకులు, స్కాలర్స్ సంతకాలతో ఫిర్యాదును చేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	82.00
లైవ్ ధర	102.00
విత్ స్కిన్	174.00
స్కిన్ లెస్	184.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

భలే రుచి బేంబూ షూట్స్

ఒకసారి తింటే.. మళ్లీ రుచి చూస్తారు

- ఎగబడి కొంటున్న వినియోగదారులు
- వెదురు కొమ్ములలో పోషక విలువలెక్కువ


లంబసింగి ఘాట్‌లో విక్రయిస్తున్న వెదురు కొమ్ములు


వెదురు కొమ్ములు స్నాక్స్

చింతపల్లి, జూలై 30: జిల్లాలో వర్షాకాలం ప్రారంభం కావడంతో ఆదివాసీల అతి ప్రియమైన ఆహారంలో ఒకటైన వెదురుకొమ్ములు మార్కెట్‌లోకి వచ్చేశాయి. వాటిని వినియోగదారులు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. పూర్వం నుంచి గిరిజనులు సంప్రదాయంగా వెదురు కొమ్ములను ఆహారంగా తీసుకుంటున్నారు. వర్షాకాలం ప్రారంభంలో అడవిలోని వెదురు మొక్కల వద్ద అధికంగా పిలకలు వస్తాయి. ఈ లేత వెదురు పిలకలను సేకరించి ఆదివాసీలు కూరగా చేసుకుని తింటారు. తొలి రోజుల్లో వెదురు కొమ్ములను ఆదివాసీలు మాత్రమే ఆహారంగా తీసుకునేవారు. కాలక్రమేణా అన్నివర్గాల ప్రజలు వెదురు కొమ్ములను ఆహారంగా తీసుకుంటున్నారు. దీనికి ప్రధాన కారణం ఏమిటంటే వెదురు కొమ్ముల కూర మంచి రుచిగా ఉంటుంది. ఒకసారి ఈ కూర తిన్నవారు మరోసారి తినాల్సిందే. మైదాన ప్రాంతాలు, పొరుగు రాష్ట్రాల నుంచి ఇక్కడ విధులు నిర్వహించేందుకు వచ్చిన ఉద్యోగులు కొమ్ముల కూర ఇష్టపడి తింటారు. వెదురు కొమ్ముల కూర తాజాగా స్టార్ హోటళ్లలోనూ లభిస్తుంది. చైనా, వియత్నం దేశాల్లోనూ వెదురు కొమ్ములను కూరగా, స్నాక్స్‌గా తీసుకుంటున్నారు. వెదురు కొమ్ములను ఆంగ్లంలో బేంబూ షూట్స్ అని పిలుస్తారు.


వెదురు కొమ్ములు

ఎగబడి కొంటున్న వినియోగదారులు

వెదురు కొమ్ములు (బేంబూ షూట్స్)ని వినియోగదారులు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం లంబసింగి ఘాట్‌లో ఆదివాసీలు వెదురు కొమ్ములను విక్రయిస్తున్నారు. ఒక వాటా(ఐదు కొమ్ములు) రూ.50 ధరకు విక్రయిస్తున్నారు. ఈ కొమ్ములను కొనుగోలు చేసేందుకు వినియోగదారులు పోటీ పడుతున్నారు. లంబసింగి ఘాట్ వద్ద గిరిజనులు ఏర్పాటు చేసిన దుకాణాల్లో ఒక్కొక్కరు ప్రతి రోజు రూ.రెండు వేల నుంచి రూ.మూడు వేల కొమ్ములు విక్రయిస్తున్నామని చెబుతున్నారు.

అత్యధిక పోషక విలువలు



వెదురు కొమ్ములు(బేంబూ షూట్స్) అత్యధిక పోషక విలువలు కలిగిన ఆహారం. ఉడికించిన వెదురు కొమ్ములు 155గ్రాముల నుంచి 64 కేలరీలు శక్తి, 2.5గ్రాముల ప్రొటీన్, 4.5 గ్రాములు ఫ్యాట్, 2గ్రాములు ఫైబర్, విటమిన్ బీ6 14 శాతం, ఈ 9 శాతం, కె 3 శాతం, రిబోఫ్లేవిన్ 3 శాతం, థైమిన్ 3శాతం, ఫాస్పరస్ 3శాతం, పొటాషియం 3శాతం, ఐరన్ 3శాతం లభిస్తుంది. పోషకాహార లోపం, రక్తహీనత కలిగిన వారితోపాటు గర్భిణులు, బాలింతలకు మంచి ఆహారం.

- బి.దివ్యసుధ, గృహవిజ్ఞాన శాస్త్రవేత్త, బీసీటీ-కేవీకే హరిపురం

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి జల్లులు

- ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి టౌన్, జూలై 30: రాగల ఐదు రోజుల్లో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఆకాశం మేఘావృతమై ఉండి తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని, అలాగే ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 25.0 నుంచి 26.0 డిగ్రీ సెల్సియస్ ఉండవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అనకాపల్లి అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సీహెచ్. ముకుందరావు తెలిపారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాగల ఐదు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నారుమడి నాటుకోవడానికి సిద్ధంగా ఉంటే ఈ వర్షాలను ఉపయోగించుకుని పచ్చిరొట్టపైరును నేలలో కలియ దున్ని, ప్రధాన పొలం తయారు చేసుకొని నాట్లు వేసుకోవాలని తెలిపారు. వర్షాల వల్ల వేరుశనగ పైరులో కలుపు సమస్య అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ కేవీ రమణమూర్తి, డాక్టర్ భవాని, డాక్టర్ సీహెచ్ రామలక్ష్మి, డాక్టర్ వి.చంద్రశేఖర్, డాక్టర్ పీవీ పద్మావతి, డాక్టర్ ఎ.అలివేణి పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్‌లో వసతులపై ఆరా

- ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఈవో


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ

ఎలమంచిలి, జూలై 30: స్థానిక తులసీనగర్‌లోని బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో వెంకట లక్ష్మమ్మ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఇదే పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్లస్-2 విద్యార్థినుల తరగతి గదులను పరిశీలించి వారితో మాట్లాడారు. ఇంగ్లీషు సబ్జెక్టు బోధన సంతృప్తికరంగా లేదని డీఈవోకు విద్యార్థినులు తెలిపారు. ఉచిత పుస్తకాలు అందలేదని విద్యార్థినులు తెలపడంతో వెంటనే పంపిణీ చేయాలని ఎంఈవో 2 అరుణ్‌కుమార్‌ను ఆదేశించారు. స్కూల్ ఆవరణలో మధ్యాహ్న భోజన పథకం వంటలను కట్టెల పొయ్యిలపై వండుతుండడాన్ని పరిశీలించి ఇది నిబంధనలకు విరుద్ధమని, నిబంధనలను పాటించకపోతే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. అసంతృప్తిగా మధ్య భవన నిర్మాణాలను పరిశీలించి వాటిని వేగంగా పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంఈవోలు మీనాక్షి, అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు వున్నారు.

'ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయీస్ డిమాండ్లను నెరవేర్చాలి'


మాట్లాడుతున్న వీవీకే రాయ్

తుమ్మపాల, జూలై 30 : ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డు కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీవీకే రాయ్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో రిటైర్డు ఎంప్లాయీస్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయీస్‌కు మినిమం రూ.తొమ్మిది వేలు పింఛన్‌ను అందజేయాలన్నారు. అలాగే డీఏ, ఈఎస్‌ఐ సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న నిత్యావసర ధరలు, వైద్య ఖర్చులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రిటైర్డు ఎంప్లాయీస్‌కు న్యాయం చేయాలన్నారు. డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 20న విశాఖలోని పీఎఫ్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ఏవీ రావు, సీహెచ్ పైడిరాజు, రాజానదొరబాబు, సత్యవతి, టీఎం దొర, విత్తనాల పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ పీహెచ్‌సీ పనులపై కౌన్సిలర్ పద్మావతి అసంతృప్తి

- కౌన్సిలర్లతో కలిసి ఆస్పత్రి సందర్శన
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన


అర్బన్ పీహెచ్‌సీ సమస్యలను తెలుసుకుంటున్న చింతకాయల పద్మావతి

నర్సీపట్నం, జూలై 30 : మునిసిపాలిటీలోని ఏడో వార్డు అలేటి జమ్మయ్య వీధిలో నిర్మించిన అర్బన్ పీహెచ్‌సీ భవనం పనులు నాసిరకంగా ఉన్నాయని, అరకొర సౌకర్యాలతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని 26వ వార్డు కార్పొరేటర్ చింతకాయల పద్మావతి అన్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ' నిర్మాణంలో నాణ్యత లేని అర్బన్ పీహెచ్‌సీ' శీర్షికన వచ్చిన కథనంపై ఆమె స్పందించారు. దీని మీద పద్మావతి కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తారు. తర్వాత మిగిలిన టీడీపీ కౌన్సిలర్‌లతో అర్బన్ పీహెచ్‌సీనిఇ సందర్శించారు. ఆస్పత్రిలో సమస్యలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మీటింగ్ హాలులోని బోరు పాయింట్, రక్త పరీక్షా కేంద్రం, పాడైన ఎంట్రన్స్ తలుపు, ఆస్పత్రి వెనక భాగంలో కుంగిన పునాదులను పరిశీలించారు. నీటి సదుపాయం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ మాట్లాడుతూ ఆస్పత్రిలోని కనీస సౌకర్యాలు లేవన్నారు. పనులు నాణ్యత లేవని, వార్డు అధ్వానంగా ఉందని విమర్శించారు. ఈ స్థలంలో కల్యాణ మండపం కట్టడానికి అయ్యన్నపాత్రుడు ప్లాన్ చేశారని తెలిపారు. ఇక్కడ ప్రజలు ఆస్పత్రి కట్టడాన్ని వ్యతిరేకించారని, వైసీపీ నాయకులు పోలీసులను అడ్డు పెట్టుకొని వైసీపీ బలవంతంగా నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. ఎక్సపరీ మందులు చాలా ఉన్నాయని, ఇక్కడ ఉపయోగ పడకపోతే ప్రాంతీయ ఆస్పత్రికైనా పంపితే ఉపయోగ పడేవన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రావాడ లక్ష్మి, డబ్బీరు శ్రీకాంత్, దనిమిరెడ్డి మధు, పెదిరెడ్ల దివ్య, పైల కాశీరత్నం, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీ ఆత్మహత్య

ఆరిలోవ (విశాఖపట్నం), జూలై 30: పోక్సో కేసులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం విశాఖ కేంద్ర కారాగారంలో జరిగింది. సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు...విశాఖ జిల్లా ఆనందపురం మండలానికి చెందిన ఉప్పాడ గౌరీశంకర్ (21) 2020 అక్టోబరు 17న ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. ముద్దాయిపై నేరం రుజువు కావడంతో పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి 20 ఏళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధించారు. అతడిని ఈనెల 25న కేంద్ర కారాగారానికి పోలీసులు అప్పగించారు. జైలుకు వచ్చినప్పటి నుంచి దిగులుగా ఉండడంతో జైలు అధికారులు పలు దఫాలు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినప్పటికీ శిక్ష పడిందనే మనస్తాపంతో గౌరీశంకర్ మంగళవారం మధ్యాహ్నం బాత్‌రూమ్‌లో తన ప్యాంటుకు ఉన్న తాడుతో వెంటిలేటర్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బకెట్ శబ్దం రావడంతో పక్క బాత్‌రూమ్‌లో ఉన్న ఖైదీ తలుపుకొట్టి చూడగా అప్పటికే కొన ఊపిరితో తాడుకు వేలాడుతున్నాడు. దీంతో జైలు అధికారులు వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచి, అతడి బంధువులకు, ఆర్డీవోకు సమాచారం ఇచ్చామని సూపరింటెండెంట్ వివరించారు. కాగా మృతుడు గతంలో లారీ క్లీనర్‌గా పనిచేసేవాడని, ఏడో తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో శిక్ష అనుభవిస్తున్నాడని ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు వాడచీపురుపల్లి విద్యార్థి ఎంపిక


విద్యార్థి అభిరామ్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం కనకేశ్వరరావు, తదితరులు

పరవాడ, జూలై 30: ఈ ఏడాది సెప్టెంబరు నెలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలకు వాడచీపురుపల్లి హైస్కూల్‌కు చెందిన ఎస్. అభిరామ్ ఎంపికైనట్టు కోచ్ ఆంజనేయులు తెలిపారు. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో అభిరామ్ 14 నుంచి 16 సంవత్సరాల విభాగంలో కాంస్య పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం పి.కనకేశ్వరరావు, పీడీ అన్నాజీరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభిరామ్‌ను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా సత్తా చాటాలని ఆకాంక్షించారు.

జీవో నంబరు 85ను వెనక్కి తీసుకోవాలి

- డీసీహెచ్‌ఎస్, డీఎం అండ్ హెచ్‌వోలకు వైద్యుల వినతి



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న వైద్యులు

అనకాపల్లి టౌన్, జూలై 30: ప్రభుత్వ వైద్యుల పీజీ ప్రవేశం కోసం ఇన్ సర్వీస్ కోటాను తగ్గిస్తూ విడుదల చేసిన జీవో నంబరు 85ను వెనక్కి తీసుకోవాలని కోరుతూ మంగళవారం డీసీహెచ్‌ఎస్ శ్రీనివాస్, డీఎం అండ్ హెచ్‌వో బాలాజీలను ప్రభుత్వ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈస్టర్ రాణి, తిరుపతిరావు కోరారు. ఈ మేరకు వారికి వినతి పత్రాలు అందజేశారు. జీవోను వెనక్కి తీసుకుని ఇన్ సర్వీస్ కోటాను మునుపటి మాదిరిగానే ఉంచాలని, ఇది సాధించే వరకు తాము పోరాడతామని సంఘ ప్రతినిధులు కోరారు.

పెన్సిల్ ముల్లుపై ఒలింపిక్స్ లోగో

- సూక్ష్మ కళాకారుడు వెంకటేశ్ ప్రతిభ


గట్టెం వెంకటేశ్, సూక్ష్మ కళాకారుడు


పెన్సిల్ ముల్లుపై ఒలింపిక్ గేమ్స్ లోగో తయారు చేసిన దృశ్యం

నక్కపల్లి, జూలై 30: ప్రస్తుతం ప్రపంచాన్ని ఒలింపిక్స్ క్రీడలు ఉర్రూతలూగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని చినదొడ్డిగల్లుకి చెందిన సూక్ష్మ కళాకారుడు, గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్న గట్టెం వెంకటేశ్ పెన్సిల్ ముల్లుపై ఒలింపిక్స్ గేమ్ లోగో తయారు చేశారు. 6డీ పెన్సిల్ ముల్లుపై 2 గంటలు శ్రమించి, 6ఎంఎం పొడవు, 12 ఎంఎం వెడల్పున ఈ లోగో తయారుచేశారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు


మాట్లాడుతున్న బత్తుల తాతయ్యబాబు

అనకాపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ 2029 నాటికి సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు తెలిపారు. మంగళవారం అనకాపల్లిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రానున్న వంద రోజుల్లో 1.25 లక్షల గృహాలు, ఏడాదిలో 8.25 లక్షల గృహనిర్మాణాలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని సంజీవరెడ్డి నగర్, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు తరహాలో కేంద్ర పథకాల సహకారంతో మధ్యతరగతి, దిగువ తరగతి వర్గాలకు, జర్నలిస్టులకు సరసమైన ధరలకు ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. త్వరలోనే సర్వే నిర్వహించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పీఎంఏవై 2.0 ప్రకారం కొత్తగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్లను మంజూరు చేస్తామన్నారు.

పెండింగ్ కేసుల పురోగతిపై దృష్టి సారించండి

- సిబ్బందికి ఎస్పీ దీపిక ఆదేశం


వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ దీపిక

పరవాడ, జూలై 30: పెండింగ్ కేసుల పురోగతిపై దృష్టి సారించాలని సిబ్బందిని ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. మంగళవారం ఆమె పరవాడ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణంలో గల వాహనాలను ఏయే కేసుల్లో సీజ్ చేశారని, ఎందుకు స్టేషన్ ప్రాంగణంలో ఉన్నాయన్న విషయాలను సీఐ బాల సూర్యారావును అడిగి తెలుసుకున్నారు. సీజ్ చేసిన వాహనాలకు ఆయా కేసుల వివరాలను ట్యాగ్ చేయాలన్నారు. జాతీయ రహదారిలో వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కేసులకు సంబంధించిన రికార్డులను ఆమె పరిశీలించారు. ఎస్పీ వెంట పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

2న జాబ్‌మేళా

విశాఖపట్నం,జూలై 30: కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఆగస్టు 2వ తేదీన జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి సీహెచ్.సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో అమర్ రాజా గ్రూప్, సినర్జీస్ క్యాస్టింగ్ లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్ గ్రూప్, అపోలో ఫార్మసీ, శ్రీరాం చిట్స్ తదితర సంస్థలు పాల్గొననున్నాయి. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ తదితర కోర్సులు చేసిన నిరుద్యోగులు హాజరుకావచ్చు. ఆసక్తి గల వారు ముందుగా తమ వివరాలను నేషనల్ కెరీయర్ సర్వీస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు.

మురా కాలువలో పూడిక తొలగించాలి

» జల వనరుల శాఖ ఏఈకి ఆయకట్టు రైతుల వినతి



ఏఈకి వినతపత్రం అందజేస్తున్న ఆయకట్టు రైతులు

పాయకరావుపేట, జూలై 30 : మండలంలోని సుమారు 20 గ్రామాలకు సాగునీరు అందించే మురా కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించి ఆయకట్టు భూములకు సక్రమంగా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను రైతులు కోరారు. శ్రీరాంపురం, వెంకటనగరం సర్పంచ్ గారా కృష్ణప్రసాద్, వంకా వెంకటరమణ ఆధ్వర్యంలో మంగళవారం పలువురు మురా కాలువ ఆయకట్టు రైతులు పాయకరావుపేటలోని జలవనరుల శాఖ ఏఈకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మురా కాలువ ద్వారా మండలంలో 20 గ్రామాల్లో సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరందించే మురా పంట కాలువలో సుమారు కిలోమీటరు మేర పూడిక, తుప్పలు పెరిగిపోవడంతో ఇబ్బందిగా మారిందన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బల్లా కృష్ణ, చించెలపు గోవిందరావు, ముప్పిన విష్ణుమహేశ్వరరావు, సత్యనారాయణ, సూరాడ త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

వరినాట్ల యంత్రంతో వ్యయప్రయాసలు తగ్గుముఖం



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

ఎలమంచిలి, జూలై 30 : వరినాట్లు వేసే యంత్రాన్ని వాడినట్టయితే త్వరితగతిన పని పూర్తి కావడమే కాకుండా ఖర్చు తగ్గుతుందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి విజేత పేర్కొన్నారు. మంగళవారం రామారాయుడుపాలెంలో యంత్రంతో వరినాట్లు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకరానికి 12 కేజీల విత్తనాలను ట్రేలలో పెంచి 21 రోజులు తరువాత ప్రధాన పొలంలో దమ్ము చేసి మెషిన్ ద్వారా నాట్లు వేసుకోవాలన్నారు. వరినాట్లు వరుసలలో వేయడం వలన గాలి, వెలుతురు బాగా తగలడంతో చీడ పురుగులు బెడద తగ్గుతుందని సూచించారు. మండల రైతాంగానికి అవసరమైన ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని ఏవో మోహనరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతు వెంకటరమణ, మురళి, చిన్నినాయుడు, వ్యవసాయ సిబ్బంది స్వాతి, అరుణ, లలిత పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం : ఎంపీడీవో శేషుబాబు



మాట్లాడుతున్న ఎంపీడీవో శేషుబాబు

కశింకోట, జూలై 30 : పౌరహక్కుల దినోత్సవం ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఎంపీడీవో శేషుబాబు పేర్కొన్నారు. మండలంలోని నూతనగుంటపాలెం దళితవాడలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీడీవో మాట్లాడుతూ చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలుసుకోవాలన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. అంతకుముందు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.నూకరత్నం, ఈవోపీఆర్డీ సోమరాజు, ఏఎస్ఐ దొర, పంచాయతీ కార్యదర్శి బాబూరావు, కశింకోట హాస్టల్ వార్డెన్ నిర్మల, టీడీపీ నాయకులు యలమంచిలి వెంకట్రావు, పిల్లి లక్ష్మి, పిల్లి ఆనంద్‌కుమార్, ఎస్.వెంకట్, పి.సుందరం, జనసేన పార్టీ నాయకులు కలిగట్ల సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ



విద్యార్థులు చేపట్టిన అవగాహన ర్యాలీ

రాంబిల్లి, జూలై 30 : డెంగ్యూ, మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా దిమిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం దిమిలిలో స్థానిక హైస్కూల్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్ఎస్‌వీఎన్ రాజు, ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ ధనరాజు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చన్నారు. ముఖ్యంగా నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కె.చినమ్మలు, ఆశా కార్యకర్తలులక్ష్మి, కనకలక్ష్మి, హైస్కూల్ ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థుల కోసం పుస్తకాలు సిద్ధం



ఎలమంచిలి, జూలై 30 : ఇంటర్ విద్యార్థుల కోసం పాఠ్య పుస్తకాలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు పాఠ్య, నోటు పుస్తకాలు విద్యాశాఖ కార్యాలయానికి చేరాయి. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఈ పుస్తకాలు లేకుండానే ఐదేళ్లు గడిచిపోయాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఇంటర్ చదివే వారికి పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేస్తామని ప్రకటించడంతో విద్యార్థుల్లో ఆనందం వ్యక్తమైంది. ప్రభుత్వం ప్రకటించిన విధంగా పుస్తకాల పంపిణీకి రంగం సిద్ధం చేసింది.ఎలమంచిలిలో బాలికల గురుకుల పాఠశాలతో పాటు, బాలికల జెడ్పీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సుమారు 7 వేలకు పైగా పాఠ్య, నోటు పుస్తకాలు వచ్చాయి. నియోజకవర్గ కేంద్రం ఎలమంచిలిలో సుమారు 3 వేలకు పైగా ఇంటర్ విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో సగానికి పైగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. వీరందరికీ పుస్తకాలు అందనున్నాయి.



శుభ పరిణామం



- ఎం.తేజ, ఇంటర్ మొదటి సంవత్సరం

ఇంటర్ విద్యార్థులకు ఉచిత పుస్తకాలు పంపిణీ చేయడం శుభ పరిణామం. విద్యార్థులను అన్ని విధాలా పోత్సాహిన్నిచ్చేలా పాలకులు దృష్టి సారించడం ఆనం దంగా ఉంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విద్యార్థులకు ఎంతో ఉపయోకరంగా ఉంటుంది.

ప్రోత్సాహంగా ఉంటుంది



- ఎస్.పూర్ణ, ఇంటర్ మొదటి సంవత్సరం

ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరిన వెంటనే ఉచిత పుస్తకాలు అందుకోనుండడం ఎంతో ఆనందంగా ఉంది. విద్యార్థుల అభ్యున్నతికి తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో ఉపయోకరంగా ఉంది. ముఖ్యంగా పేద విద్యార్థులు ఇదో వరమనే చెప్పాలి.

బస్టాండ్‌లో ఆక్రమణలపై చర్యలు అవసరం



మునిసిపల్ కమిషనర్ ప్రబాకర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న జనసేన పార్టీ నేతలు

ఎలమంచిలి, జూలై 30 : ఎలమంచిలి ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ రోడ్డులో ఆక్రమణలు తొలగించాలని, పూర్తిస్థాయిలో ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలని కోరుతూ ఇన్‌చార్జ్ మునిసిపల్ కమిషనర్ ప్రభాకరరావును మంగళవారం జనసేన పార్టీ నేతలు కలిసి కోరారు. ఈ సందర్భంగా జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను మాట్లాడుతూ.. ఈ సమస్యను ఇది వరకే కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని, తాజాగా మరోసారి ఇన్‌చార్జ్ కమిషనర్‌ను వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఇక్కడ సమస్య జఠిలంగా ఉండడం వల్లే తాము వెంటనే పరిష్కారం చేపట్టాలని కోరుతున్నామన్నారు. బస్టాండ్‌లోకి ఎక్స్‌ప్రెస్ బస్సులు రావాలని ఆర్టీసీ అధికారులను కోరగా, ఇక్కడ ఉన్న ఓ విగ్రహం దిమ్మె అడ్డుగా ఉందని చెబుతున్నారని శ్రీను తెలిపారు. ఈ సమస్యను అధికారులు పరిష్కరిస్తే ప్రయాణికులకు ఇబ్బందులు తొలగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకుడు ఆడారి పూరి జగన్నాథం, జనసేన పార్టీ, టీడీపీ నేతలు కొఠారు నరేష్, గుర్రాల శేఖర్, పల్లా సత్యనారాయణ, కరణం రవి, సతీష్, గణేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మాధురి ఆత్మహత్యకు కారకులపై చర్యలు : ఏఐటీయూసీ డిమాండ్



మాధురి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మునగపాక, జూలై 30 : అచ్యుతాపురం బ్రాండిక్స్ ఎస్ఈజెడ్‌లో తియన యూన్ గార్మెంట్స్‌లో విధులు నిర్వహిస్తూయాజమాన్యం వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన నక్కా మాధురి కుటుంబానికి న్యాయం చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు.మంగళవారం అరబుపాలెంలో మాధురి కుటుంబసభ్యులను పరామర్శించి మాట్లాడారు. మాధురి ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జి.కోటేశ్వరరావు, ఆర్. రాము, వీవీ శ్రీనివాసరావు, ఎస్. బ్రహ్మాజీ, కర్రి అప్పారావు, రావి దేముళ్లు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల : అచ్యుతాపురం మండలంలో గల తియనయూన్ గార్మెంట్స్‌లో విధులు నిర్వహిస్తూ యాజమాన్యం వేధింపుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన నక్కా మాధురి కుటుంబానికి న్యాయం చేయాలని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు.

అప్రమత్తతతో సీజనల్ వ్యాధులకు దూరం : డిప్యూటీ డీఈవో



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిప్యూటీ డీఈవో

కోటవురట్ల, జూలై 30 : వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ఎప్పుడూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలోని జల్లూరు జడ్పీహెచ్ హైస్కూలును ఆకస్మికంగా సందర్శించారు. ఉత్తమ బోధన అందించడం ద్వారా మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. టెన్త్ విద్యార్థులకు బోధిన, అభ్యసనం విషయాల్లో ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. ఒత్తిడితో కాకుండా వారు ఇష్టంతో చదివేలా జాగ్రత్త వహించాలన్నారు.విద్యార్థులకు పలుప్రశ్నలు వేశారు. వారి నుంచి సరైన సమా ధానాలు రావడంతో వారిని అభినందించా రు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడి సూచనలు అందించారు. ఆయనతో హెచ్‌ఎం శ్రీనివాస్‌మూర్తి, టీచర్లు సుకుమార్, ప్రసన్నకుమార్ ఉన్నారు.

అనధికార లేఅవుట్‌పై చర్యలు చేపట్టరూ..



వీఎంఆర్డీఏ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

పాయకరావుపేట, జూలై 30 : మండలంలోని నామవరం రెవెన్యూ పరిధిలో వేసిన అనధికార లే అవుట్‌పై చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు వీఎంఆర్డీఏ అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం విశాఖలోని వీఎంఆర్డీఏ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్, మండల సీపీఐ కార్యదర్శి వెలుగుల అర్జునరావు కలిసి వీఎంఆర్డీఏ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జగతా శ్రీనివాస్ మాట్లాడుతూ నామవరం రెవెన్యూ పరిధిలో జాతీయ రహదారిని ఆనుకుని వివిధ సర్వే నంబర్లలోని సుమారు 6.5 ఎకరాల వ్యవసాయ భూమిని అనధికారికంగా లే అవుట్ వేసి ఇండ్ల స్థలాలుగా మార్చి విక్రయిస్తున్నారన్నారు. దీనిపై వీఎంఆర్డీఏ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు ధనిశెట్టి తిరుమలేశ్వరరావు, వికాస తరంగిణి సభ్యులు చిక్కాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'పేట'లో అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలి

పాయకరావుపేట పట్టణంలో లక్ష్మి థియేటర్ సమీపంలో అనుమతిలేకుండా జరుగుతున్న నిర్మాణంపై వీఎంఆర్డీఏ అధికారులు నోటీసు జారీ చేసినా నిర్మాణం జరుపుతున్నారని, దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వీఎంఆర్డీఏ అధికారులకు విజ్ఞప్తి చేశామని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్ తెలిపారు.

డస్ట్‌బిన్లు పంపిణీ



చెత్తబుట్టలను పంపిణీ చేస్తున్న టీడీపీ నేత శ్రీనివాస్ యాదవ్ తదితరులు

అచ్యుతాపురం, జూలై 30 : పంచాయతీ పరిధిలో గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రజలు దృష్టి సారించాలని సీనియర్ టీడీపీ నాయకులు పుర్రే శ్రీనివాస యాదవ్ అన్నారు. మంగళవారం మోసయ్యపేట పరిధిలో ఇంటింటికీ చెత్త బుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో పరిశుభ్రతపై అందరూ శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఇళ్లలో చెత్తను తాము ఇచ్చిన బుట్టల్లో వేయాలని, పంచాయతీ సిబ్బంది ప్రతి రోజు వచ్చి చెత్తను తరలిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధరరెడ్డితో పాటు పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

నేడు గుంటపల్లిలో హోం మంత్రి పర్యటన

» పలు అభివృద్ధి పనులు ప్రారంభం

పాయకరావుపేట, జూలై 30 : రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత బుధవారం పాయకరావుపేట మండలం గుంటపల్లిలో పర్యటించనున్నారని ఎంపీడీవో కె.స్వప్న తెలిపారు. ఉదయం 10 గంటలకు గుంటపల్లి వస్తున్న మంత్రి గ్రామంలో సచివాలయం నూతన భవనం ప్రారంభించనున్నారని, అన్ని ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె కోరారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరావు

తుమ్మపాల, జూలై 30 : స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కో-ఆపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎస్‌సీయూఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మళ్ల మాధవరావు మాట్లాడుతూ హింస విడనాడి విలువలు, శాంతితో కూడిన మెరుగైన సమాజ నిర్మాణం కోసం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం ఉద్దేశంచిబడిందన్నారు. స్నేహమనేది ప్రపంచంలోనే అత్యంత విలువైన బంధమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌సీయూఎఫ్ ప్రతినిధులు దాడి శివరామ్, మొల్లి రమణబాబు, బొట్టా చిన్నియాదవ్, ఎంఆర్ఎస్ ప్రకాశరావు, మళ్ల చక్రవర్తి, రాజాన దొరబాబు, వైఎస్ భద్రం, కోన లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు హ్యాండ్ మైక్ సెట్ బహూకరణ



హ్యాండ్ మైక్ సెట్ అందజేస్తున్న కానిస్టేబుల్ కాసులు

నక్కపల్లి, జూలై 30 : మండలంలోని రాజయ్యపేట జడ్పీ హైస్కూల్‌లో టెన్త్ చదువుకుని, సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తున్న పూర్వ విద్యార్థి పిక్కి కాసులు మంగళవారం స్కూలుకు హ్యాండ్‌మైక్ బహూకరించారు. హెచ్‌ఎం జి.నారాయణరావు, సీనియర్ ఉపాధ్యాయుడు డీవీఎస్‌రావు సమక్షంలో పాఠశాలకు ఈ మైక్‌సెట్‌ను అందజేశారు.

ఎస్‌వీడీఎస్ కార్యాలయంలో వైద్య శిబిరం

తుమ్మపాల, జూలై 30 : మండలంలోని తుమ్మపాల ఎస్‌వీడీఎస్ కార్యాలయంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 150 మందికి వైద్య బృందం సేవలను అందజేశారు. మహిళలు, పిల్లలకు పలు వైద్యపరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌వీడీఎస్ కార్యదర్శి కర్రి జోగినాయుడు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సూర్యప్రభ, డాక్టర్ నాయుడు, అనిల్‌కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ గరంగరం

... 5వ పేజీ తరువాయి

పడిపోయే పరిస్థితిలో ఉందని తెలిపారు. 18వ వార్డు కౌన్సిలర్ శెట్టి విజయాంబ మాట్లాడుతూ బలిఘట్టంలోని డంపింగ్ యార్డును వేరే ప్రదేశంలోకి తరలించాలని కోరారు. 9వ వార్డు జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ 9 నెలలుగా పని చేయని ఎక్స్‌కవేటర్‌కి డీజిల్ బిల్లులు ఎలా రాసుకుంటారని ఏఈని నిలదీశారు. బండి తిరక్కుండా 5 నెలలు డీజిల్ బిల్లులు రాసుకున్నారని నిరూపిస్తానని, లేని పక్షంలో పదవికి రాజీనామా చేస్తానని చాలెంజ్ చేశారు. ముందస్తు జాగ్రత్తగా పట్టణ పోలీసులు బందో బస్తు ఏర్పాటు చేశారు. పట్టణ ఇన్‌చార్జి సీఐ హరి, ఎస్ఐ సుధాకర్ హాజరయ్యారు.

రసవత్తరంగా స్టాండింగ్ కమిటీ ఎన్నిక

... 5వ పేజీ తరువాయి

నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నుంచి పది మంది, వైసీపీ నుంచి పది మంది నామినేషన్లు దాఖలు చేశారు. 97 మంది కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీ సభ్యులను బ్యాలెట్ ద్వారా ఎన్నుకోవాల్సి ఉంటుంది.

2021లో జీవీఎంసీకి జరిగిన ఎన్నికల్లో వైసీపీ నుంచి 58 మంది, టీడీపీ నుంచి 30 మంది, జనసేన తరపున ముగ్గురు, సీపీఐ, సీపీఎం, బీజేపీ నుంచి ఒక్కొక్కరు కార్పొరేటర్లుగా గెలిచారు. నాలుగు వార్డుల్లో స్వతంత్రులు విజయం సాధించారు. అనంతరం జరిగిన పరిణామాల్లో కొంతమంది కార్పొరేటర్లు పార్టీలు మారడంతో కౌన్సిల్‌లో పార్టీల బలాబలాలు మారుతూ వచ్చాయి. 21వ వార్డు కార్పొరేటర్‌గా వైసీపీ తరపున విజయం సాధించిన వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఎమ్మెల్సీగా అవకాశం వచ్చింది. దీంతో కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం 97 మంది మాత్రమే ఉన్నారు. ఇటీవల వైసీపీకి చెందిన 12 మంది కార్పొరేటర్లు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. వీరిలో ఏడుగురు టీడీపీలో చేరిపోగా, ఐదుగురు జనసేనకు మద్దతు ప్రకటించారు. దీంతో కౌన్సిల్‌లో వైసీపీ బలం 48కి తగ్గిపోగా, కూటమి బలం 47కి పెరిగింది. సీపీఐ, సీపీఎం నుంచి ఒక్కొక్క కార్పొరేటర్ ఉన్నప్పటికీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వారి వైఖరి ఏమిటనేది ఇంకా ప్రకటించలేదు. స్టాండింగ్ కమిటీలో ఒక్కో సభ్యుడికి కనీసం 49 ఓట్లు అవసరం కాగా ప్రస్తుతం వైసీపీకి 48 మంది, కూటమికి 47 మంది సభ్యుల మద్దతు ఉండడంతో ఎన్నిక ఆసక్తిగా మారింది. వైసీపీకి చెందిన మరికొందరు కార్పొరేటర్లు ఆ పార్టీని వీడి కూటమి పార్టీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే జనసేనకు మద్దతు ప్రకటించిన ఐదుగురికి అధికారికంగా పార్టీ కండువా కప్పలేదు. దీనికోసం రెండుసార్లు ముహూర్తాలు పెట్టుకున్నప్పటికీ పార్టీ అధిష్ఠానం నుంచి అభ్యంతరం వ్యక్తమవ్వడంతో చేరికలకు బ్రేక్ పడిందని ప్రచారం జరుగుతోంది. మరోవైపు టీడీపీలో చేరేందుకు మరికొందరు వైసీపీ కార్పొరేటర్లు ఆసక్తిగా ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యేలు, ఆయా వార్డుల్లోని నాయకులు, కార్యకర్తల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అయితే స్టాండింగ్ కమిటీకి వచ్చే నెల ఏడో తేదీన ఎన్నిక జరగబోతుండడంతో ఆలోగా చేరికలను పూర్తిచేయాలని టీడీపీ నేతలు తాపత్రయపడుతున్నారు. దీనికోసం ఎమ్మెల్యేలను పలుమార్లు కలిసి తమ గోడు వినిపిస్తున్నారు.

☛ సంక్షిప్తంగా..

మోడకొండమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



మోదకొండమ్మసన్నిధిలో ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం, జూలై 30 : ఖాజీపాలెంలోని మోదకొండమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మంగళవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి పండగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. జగ్గన్నపేట, పెదపాడు తదితర గ్రామాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పీలా తులసీరామ్, పీలా సందీప్, జనపరెడ్డి శ్రీనివాసరావు, బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని అరబుపాలెం గ్రామ ఇలవేల్పు పరదేశమ్మ అమ్మవారి జాతర సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ నాయకులు ఎమ్మెల్యేను దుశ్శాలువలతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు టెక్కలి పరుశురాం, ఆడారి శ్రీకాంత్, యల్లపు సంతోష్‌కుమార్, కొయిలాడ గంగాధర్, దాడి అప్పలనాయుడు, బొడ్డేడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటర్ పాఠ్య పుస్తకాలు పంపిణీ

పరవాడ, జూలై 30 : ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా సమకూర్చిన పాఠ్య పుస్తకాలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ జీవీ నారాయణరావు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 332 మంది ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలను అందజేశామన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయ ఏవోగా కనకారావు



అనకాపల్లి టౌన్, జూలై 30 : అనకాపల్లి ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారిగా పి.కనకారావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల ముందు వరకు పరవాడ తహసీల్దార్‌గా పని చేసిన కనకారావు ఎన్నికల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో సొంత జిల్లాలకు వచ్చిన తహసీల్దార్లు కలెక్టరేట్‌లో హాజరయ్యారు. ఈ క్రమంలో కనకారావును అనకాపల్లి ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారిగా నియమితులయ్యారు.

4న రక్తదాన, వైద్య శిబిరం

పరవాడ, జూలై 30 : ఓనస్ ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా ఆగస్టు 4న వెన్నెలపాలెంలో మెగా రక్తదాన, ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో వైద్యపరీక్షలతో పాటు ఉచితంగా మందులను అందజేస్తామన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువత అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని వారు కోరారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలేవి?

అనకాపల్లి టౌన్, జూలై 30 : శారదానది వద్ద వినాయక ఘాట్‌పై అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించాలని వినాయక నిమజ్జనోత్సవ కమిటీ మంగళవారం జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడును కోరింది. ఏడాదిలో ఆరు నెలల పాటు వినాయకుడు, దుర్గాదేవి, కామాక్షి అమ్మవారు, గౌరీ పరమేశ్వరు.. ఇలా ఉత్సవాలకు సంబంధించి దేవతామూర్తుల నిమజ్జనోత్సవాలు శారదా నదిలో నిర్వహిస్తుంటామన్నారు. అయితే వినాయక ఘాట్ ప్లాట్‌ఫాంను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి పేర్కొన్నారు. వినాయకచవితి సమీపిస్తున్నందున ఆక్రమణలను తొలగింపునకు వెంటనే చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో కొణతాల హరినాథ్‌బాబు,సోమశేఖర్ పట్నాయక్, కొడుకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో 'పొలంబడి'



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో రంగాచారి

కొత్తూరు, జూలై 30 : అనకాపల్లి మండలం సీతానగరంలో మంగళవారం పొలంబడి నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి పీయూబీపీ రంగాచారి నారుమడి యాజమాన్యం పద్ధతులపై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వరినాట్లు వేసే ముందు నారుమడిలో 2 కిలోల సూపర్ ఫాస్ఫేట్ వేసుకోవాలన్నారు. దీని ద్వారా నీరు తీసేటప్పుడు త్వరగా రావడమే కాకుండా వేరు కుదుర్లు వదులుగా మారి వరివేర్లు తెగిపోకుండా ప్రధాన పొలంలో వేసుకోవడానికి అనువుగా ఉంటుందన్నారు. ఒక కేజీ కార్బోఫ్యూరాన్ గుళికలు వేసుకోవడం ద్వారా వరి పంటకు సంక్రమించే రసం పీల్చే పురుగుల నుంచిఒక నెల రోజుల పాటు కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జ్యోతిమోహన్, రైతులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు వేలంపాట

రాంబిల్లి, జూలై 30 : హరిపురంలోని శ్రీఉమాధర్మ లింగేశ్వరస్వామివారి మెట్టు భూములు సర్వే నంబర్లు 48,49ల్లోని 7.12 ఎకరాలకు మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మూడేళ్ల కాలపరిమితికి వేలంపాట నిర్వహించినట్టు దేవస్థానం ఈవో శాంభవి వరాపు తెలిపారు. దిబ్బపాలెనికి చెందిన రైతు లాలం వెంకటరమణ పై రెండు సర్వే నంబర్లలోని భూములకు ఏడాదికి రూ.99 వేల 750లు చొప్పు మూడేళ్ల కాలానికి రూ2 లక్షల 99వేల 250లకు వేలంపాట పాడుకున్నారని ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో వేలంపాట పర్యవేక్షకులు బి.శ్రీనివాసరాజు, జడ్పీటీసీ సభ్యులు ధూళి నాగరాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డి.రంగనాయకులు, జనసేన పార్టీ అచ్యుతాపురం మండల శాఖ అధ్యక్షులు బైలపూడి రామదాసు పాల్గొన్నారు.

నర్సీపట్నం

నియోజకవర్గం

ఒలింపిక్స్ ప్లేయర్లకు స్పీకర్ అభినందనలు



క్రీడాకారులకు అభినందనలు తెలుపుతున్న స్పీకర్

నర్సీపట్నం, జూలై 30 : చీర్ ఫర్ భారత్ సెల్ఫీతో సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు దేశం తరఫున ఒలింపిక్స్‌లో పాల్గొన్న క్రీడాకారులకు మంగళవారం అభినందనలు తెలిపారు. యువతలో క్రీడాస్ఫూర్తి నింపడానికి, అవగాహన కల్పించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగ పడతాయని ఆయన అన్నారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

జనసైనికులు సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలి

» జనసేన నర్సీపట్నం ఇన్‌చార్జ్ సూర్యచంద్ర



ఏఎల్ పురంలో సభ్యత్వ నమోదు చేస్తున్న జనసేన నేతలు

కృష్ణాదేవిపేట/ నాతవరం, జూలై 30 : జనసైనికులు సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలని నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన సూర్యచంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం గొలుగొండ మండలం ఏఎల్‌పురం ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో జనసేన సభ్యత్వ నమోదు ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేశారు. అనంతరం పలువురు నాయకులు, కార్యకర్తల నుంచి సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ ఆగస్టు 5 వరకు కొత్త సభ్యత్వ నమోదు, రెన్యువల్‌చేపడుతున్నట్లు తెలిపారు. క్రియాశీలక సభ్యత్వ రుసుం కింద రూ.500 చెల్లిస్తే సదరు వ్యక్తి మృతి చెందితే రూ.5 లక్షలు, గాయపడితేరూ.50 వేలు కుటుంబ సభ్యులకుబీమా వర్తిస్తుందన్నారు. క్రియాశీలక సభ్యత్వం పొందిన వారు పార్టీ పటిష్టత కోసం పని చేయాలని పేర్కొన్నారు. అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాల నుంచి సభ్యత్వ నమోదుకు ఆదరణ లభిస్తోందని సూర్యచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ సీనియర్ నాయకులు దొరబాబు, రేగుబల్ల సాంబశివ, సలాదుల ప్రసాద్, దుంగల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మరమ్మతులకు స్పీకర్ అయ్యన్న రూ.1.5 లక్షలు వితరణ

నర్సీపట్నం, జూలై 30 : స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యుత్ మరమ్మతులకు సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు రూ.1.5 లక్షలు సొంత నగదును అందజేశారు. గత కొన్ని రోజులుగా అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యుత్ మరమ్మతులకు గురవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ మరమ్మతులకు మొత్తం రూ.3 లక్షలు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేశారు. ప్రిన్సిపాల్ రాజేశ్రీ, సిబ్బంది మంగళవారం స్పీకర్ కలిసి సమస్య వివరించడంతో ఆయన తక్షణమే స్పందించి రూ.1.5 లక్షలు నగదు అందజేశారు. మిగిలిన నిధులు సొసైటీ నుంచి తీసుకొని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల సిబ్బంది స్పీకర్ అయ్యన్నకు కృతజ్ఞతలు తెలిపారు.



బాలయోగి గురుకులం ప్రిన్సిపాల్‌కు నగదు అందజేస్తున్న సభాపతి అయ్యన్నపాత్రుడు

కార్పెంటర్ల సంక్షేమానికి చర్యలు చేపట్టాలి

» కార్పెంటర్ వడ్రంగి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాడికొండ రంగారావు



ప్రమాణ స్వీకారం చేస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

నర్సీపట్నం, జూలై 30 : కార్పెంటర్లకు పని చేసుకోవడానికి షెడ్లు మంజూరు చేయాలని రాష్ట్ర కార్పెంటర్ వడ్రంగి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాడికొండ రంగారావు కోరారు. మంగళవారం టీటీడీ కల్యాణ మండపంలో సంఘం ఏడో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిలో గాయపడి అంగవైకల్యం బారిన పడిన వారికి బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. వడ్రంగి పని వారికి ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి యంత్ర సామగ్రి కొనుగోలుకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పెదపాటి గోవిందరావు, విశ్రాంత ఎంఈవో జేఎస్ఎస్ నాగేశ్వరరావు, పెదపూడి నర్సింహమూర్తి, పొలుమూరి బ్రహ్మాజీ, పూడి చంద్రశేఖర్, కొమ్మోజు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క రోజులోనే పింఛన్ల పంపిణీ పూర్తి

» మండల ప్రత్యేక అధికారి మనోరమ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న మనోరమ

మాకవరపాలెం, జూలై 30 : మండలంలో ఒక్క రోజులోనే పింఛన్లు పంపిణీ జరగాలని మండల ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కె.మనోరమ తెలిపారు. మంగళవారం మాకవరపాలెం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయం సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. మండలంలో ఉన్న 10,215 పింఛన్‌దారులకు ఒకే రోజు పింఛన్ అందాలన్నారు. అలాగే ఉదయం ఆరుగంటల నుంచే పింఛన్ పంపిణీ నిర్వహించాలని ఆమె సిబ్బందికి సూచించారు. ఇందుకోసం ప్రతి గ్రామంలోని ముందుస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. గత నెలలో పింఛన్ పంపిణీలో జిల్లాలో మూడో స్థానంలో ఈ మండలం నిలిచిందని గుర్తు చేశారు. ఈసారి మొదటి స్థానంలో నిలిచేందుకు అంతా కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో చంద్రరావు, ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి, డీటీ శంకరరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలంటూ ఆందోళన

నాతవరం, జూలై 30 : నాతవరంమండలంలో ఏపీ పురంలో గత రెండు రోజుల నుంచి విద్యుత్ సరఫరా లేదు. దీంతో గ్రామస్థులు అనేక అవస్థలు పడుతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో గ్రామస్థులు నిరసనకు దిగారు. సర్పంచ్ పైల రమేశ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గ్రామస్థులు గన్నవరం సబ్‌స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. తమ గ్రామానికి వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.



సబ్ స్టేషన్ ఎదుట ఏపీ పురం వాసుల ఆందోళన

ఉత్తమ బోధనతో సత్ఫలితాలు : ఎంపీడీవో



విద్యార్థుల నుంచి సమాధానాలు రాబడుతున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం, జూలై 30 : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని ఎంపీడీవో జె. రాంబాబు అన్నారు.మంగళవారం ఆయన మాధవనగరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగారు. బ్లాక్‌బోర్డుపై అక్షరాలు రాసి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కొందరు విద్యార్థులు చదువులో వెనుకబడి ఉన్నారని, వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం వల్లంపేట, మాధవనగరం గ్రామాల్లో పర్యటించి తాగునీటి ట్యాంక్‌లను పరిశీలించారు.

2 నుంచి నూకాలమ్మ జాతర

గొలుగొండ, జూలై 30 : మండలంలోని వచ్చే నెల 2 నుంచి 4వ తేదీ వరకూ నూకాలమ్మ అమ్మవారి జాతర నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు కొమరవోలు చిట్టిబాబు తెలిపారు. రెల్లి కాలనీలో వెలసిన నూకాలమ్మ అమ్మవారి పండగ సందర్భంగా రెండు రోజుల పాటు ప్రత్యేక ఉత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎంఈవో పాఠశాలల సందర్శన

నర్సీపట్నం, జూలై 30 : మండలంలోని నీలంపేట, నర్సీపట్నం బీసీ కాలనీ ఎంపీపీ పాఠశాలలను ఎంఈవో తలుపులు సందర్శించారు. మంగళవారం పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థుల నోటు పుస్తకాలు పరిశీలించి విద్యా బోధనపై సూచనలు చేశారు. నీలంపేట పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న ఉద్దండ హర్షిత పుట్టిన రోజు సందర్భంగా మొక్కను కానుకగా అందజేసి పాఠశాల ఆవరణలో నాటించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాఠశాలల పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. ముఖ్యంగా నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు డీవీఆర్ మూర్తి పాల్గొన్నారు.

కౌన్సిల్ గరంగరం

... 5వ పేజీ తరువాయి

పడిపోయే పరిస్థితిలో ఉందని తెలిపారు. 18వ వార్డు కౌన్సిలర్ శెట్టి విజయాంబ మాట్లాడుతూ బలిఘట్టంలోని డంపింగ్ యార్డును వేరే ప్రదేశంలోకి తరలించాలని కోరారు. 9వ వార్డు జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ 9 నెలలుగా పని చేయని ఎక్స్‌కవేటర్‌కి డీజిల్ బిల్లులు ఎలా రాసుకుంటారని ఏఈని నిలదీశారు. బండి తిరక్కుండా 5 నెలలు డీజిల్ బిల్లులు రాసుకున్నారని నిరూపిస్తానని, లేని పక్షంలో పదవికి రాజీనామా చేస్తానని చాలెంజ్ చేశారు. ముందస్తు జాగ్రత్తగా పట్టణ పోలీసులు బందో బస్తు ఏర్పాటు చేశారు. పట్టణ ఇన్‌చార్జి సీఐ హరి, ఎస్ఐ సుధాకర్ హాజరయ్యారు.

రసవత్తరంగా స్టాండింగ్ కమిటీ ఎన్నిక

... 5వ పేజీ తరువాయి

నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నుంచి పది మంది, వైసీపీ నుంచి పది మంది నామినేషన్లు దాఖలు చేశారు. 97 మంది కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీ సభ్యులను బ్యాలెట్ ద్వారా ఎన్నుకోవాల్సి ఉంటుంది.

2021లో జీవీఎంసీకి జరిగిన ఎన్నికల్లో వైసీపీ నుంచి 58 మంది, టీడీపీ నుంచి 30 మంది, జనసేన తరఫున ముగ్గురు, సీపీఐ, సీపీఎం, బీజేపీ నుంచి ఒక్కొక్కరు కార్పొరేటర్లుగా గెలిచారు. నాలుగు వార్డుల్లో స్వతంత్రులు విజయం సాధించారు. అనంతరం జరిగిన పరిణామాల్లో కొంతమంది కార్పొరేటర్లు పార్టీలు మారడంతో కౌన్సిల్‌లో పార్టీల బలాబలాలు మారుతూ వచ్చాయి. 21వ వార్డు కార్పొరేటర్‌గా వైసీపీ తరఫున విజయం సాధించిన వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఎమ్మెల్సీగా అవకాశం వచ్చింది. దీంతో కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం 97 మంది మాత్రమే ఉన్నారు. ఇటీవల వైసీపీకి చెందిన 12 మంది కార్పొరేటర్లు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. వీరిలో ఏడుగురు టీడీపీలో చేరిపోగా, ఐదుగురు జనసేనకు మద్దతు ప్రకటించారు. దీంతో కౌన్సిల్‌లో వైసీపీ బలం 48కి తగ్గిపోగా, కూటమి బలం 47కి పెరిగింది. సీపీఐ, సీపీఎం నుంచి ఒక్కొక్క కార్పొరేటర్ ఉన్నప్పటికీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వారి వైఖరి ఏమిటనేది ఇంకా ప్రకటించలేదు. స్టాండింగ్ కమిటీలో ఒక్కో సభ్యుడికి కనీసం 49 ఓట్లు అవసరం కాగా ప్రస్తుతం వైసీపీకి 48 మంది, కూటమికి 47 మంది సభ్యుల మద్దతు ఉండడంతో ఎన్నిక ఆసక్తిగా మారింది. వైసీపీకి చెందిన మరికొందరు కార్పొరేటర్లు ఆ పార్టీని వీడి కూటమి పార్టీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే జనసేనకు మద్దతు ప్రకటించిన ఐదుగురికి అధికారికంగా పార్టీ కండువా కప్పలేదు. దీని కోసం రెండుసార్లు ముహూర్తాలు పెట్టుకున్నప్పటికీ పార్టీ అధిష్ఠానం నుంచి అభ్యంతరం వ్యక్తమవ్వడంతో చేరికలకు బ్రేక్ పడిందని ప్రచారం జరుగుతోంది. మరోవైపు టీడీపీలో చేరేందుకు మరికొందరు వైసీపీ కార్పొరేటర్లు ఆసక్తిగా ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యేలు, ఆయా వార్డుల్లోని నాయకులు, కార్యకర్తల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అయితే స్టాండింగ్ కమిటీకి వచ్చే నెల ఏడో తేదీన ఎన్నిక జరగబోతుండడంతో ఆలోగా చేరికలను పూర్తి చేయాలని టీడీపీ నేతలు తాపత్రయపడుతున్నారు. దీనికోసం ఎమ్మెల్యేలను పలుమార్లు కలిసి తమ గోడు వినిపిస్తున్నారు.

చోడవరం

నియోజకవర్గం

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

బుచ్చెయ్యపేట, జూలై 30: వడ్డాది జూనియర్ కళాశాలలో 140 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు మంగళవారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వ కళాశాలల్లో చదువుకునే ఇంటర్ విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలు పంపిణీ చేయాలని నిర్ణయించారని, ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల మందికి పైబడి పుస్తకాలు పంపిణీ చేస్తున్నారన్నారు. ఒక్కో విద్యార్థికి 12 నోట్ పుస్తకాలతో పాటు సంబంధిత గ్రూపు పాఠ్య పుస్తకాలు, బ్యాగులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, టీడీపీ వడ్డాది అధ్యక్షుడు దొండా నరేష్, కూటమి నాయకులు దొండా సన్యాసిరావు, దాడి సూర్యనాగేశ్వరరావు, జి.కోటేశ్వరరావు, వి.అప్పారావు, అప్పలనాయుడు, వేణుచౌదరి, వీర్లసురేష్, సాయం శేష, ప్రిన్సిపాల్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

స్వయంభూ గణపతి ఆలయ హుండీ లెక్కింపు

చోడవరం, జూలై 30: ప్రముఖ స్వయంభూ విఘ్నేశ్వర ఆలయం హుండీ లెక్కింపు కార్యక్రమం మంగళవారం దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహించారు. ఈ ఏడాది మే 21 నుంచి జూలై 30వ తేదీ వరకు లక్షా 75 వేల 19 రూపాయల ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారులు శ్రీధర్, ఈవో సత్యనారాయణ, అర్చకులు చలపతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవస్థానం
దేవాదాయ ధర్మాదాయ శాఖ - లింగంపేట గ్రామం & గొలుగొండ మండలం, అనకాపల్లి జిల్లా

బహిరంగ వేలం ప్రకటన

అనకాపల్లి జిల్లా, గొలుగొండ మండలం, లింగంపేట గ్రామంలో వేంచేసియున్న శ్రీ నూకాలమ్మ అమ్మవారి యొక్క హక్కు భుక్తములో గల ఈ దిగువ షెడ్యూల్ నందు తెలిపిన భూమిని 6 సం.ల కాలమునకు కౌలుకు ఇచ్చుటకు గాను తేదీ. 05-08-2024 ఉ. 11 గంటలకు శ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవాలయ ఆవరణలో గ్రామ పెద్దల మరియు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షమున బహిరంగ వేలం పాట జరుపబడును.

క్రమ సంఖ్య	భూమి ఉన్న గ్రామం	సర్వే నెం.	విస్తీర్ణం	కౌలు కాలం
1	కొత్త మల్లంపేట	36/1	15.33	2024-2025 నుండి 2029-2030 వరకు ఆరు (6) సం.ల కాలమునకు

పాటలో పాల్గొనవలసిన వారు గమనించవలసిన ముఖ్య షరతులు

1. ఈ వేలం పాట దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు మంజూరు ఉత్తర్వులకు లోబడి నిర్వహించబడును.
2. పాటదారులు పాటకు ముందు ప్రథమ ధరావత్తు రూ. 10,000/-లు చెల్లించి పాటలో పాల్గొను నిర్ణయం.
3. పాట ముగిసిన వెంటనే హెచ్చు పాటదారుడు 1 సం. శిస్తు సొమ్ము వెంటనే చెల్లించవలెను మరియు దేవస్థానము పేరున 3 చెక్కులు ఇవ్వవలెను.
4. పాటదారుడు పాట సమయమున తన ఆధార్ కార్డు నకలు ఇవ్వవలెను.
5. దేవస్థానము వారికి బకాయిలు వున్న వారు, కోర్టు లావాదేవీలు వున్న వారు పాటలో పాల్గొనకుండా చేయుటకు ఆలయ అధికారి వారికి అధికారము కలదు.
6. ఏ కారణము చేతనైన పాట అపు చేయుటకు గాని వాయిదా వేయుటకు కాని రద్దు చేయుటకు గాని ఆలయ అధికారి వారికి అధికారము కలదు, హిందూ మతమునకు చెందిన వారు మాత్రమే పాటలో పాల్గొనుటకు అర్హులు.
7. మిగిలిన పాట షరతులు దేవాలయ కార్యాలయం పని చేయు వేళల్లో అడిగి తెలుసుకొనవలెను.

25-07-2024
లింగంపేట

కార్యనిర్వహణాధికారి
శ్రీ నూకాలమ్మవారి దేవస్థానం

నియోజకవర్గానికి రూ.20 కోట్ల ఉపాధి నిధులు

» రహదారులు, మురుగునీటి కాల్వల అభివృద్ధి: ఎమ్మెల్యే రాజు

చోడవరం, జూలై 30: నియోజకవర్గానికి రూ.20 కోట్ల ఉపాధి నిధులు మంజూరైనట్టు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రకటించారు. పట్టణంలోని కోఆపరేటివ్ కాలనీ, లక్ష్మీపురం రోడ్డులోని సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.20 కోట్లలో రోలుగుంట, రావికమతం, బుచ్చెయ్యపేట, చోడవరం మండలాలకు రెండేసి కోట్ల చొప్పున, చోడవరం పట్టణానికి రూ.2 కోట్లు కేటాయించామన్నారు. ఈ నిధులతో పనులు వెంటనే చేపట్టి నెల రోజుల్లోగా పూర్తి చేస్తామని, అనంతరం రెండో విడత నిధులు కేటాయిస్తామని ఆయన చెప్పారు.

విపక్ష నేతలు కలిసి రావాలి

నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు విపక్ష ప్రజా ప్రతినిధులు తమ కోటా నిధులను కూడా కేటాయించి రాజకీయాలకతీతంగా అభివృద్ధిలో భాగం పంచుకోవాలని ఎమ్మెల్యే రాజు పిలుపునిచ్చారు. ఈ రెండేళ్లలోనైనా విపక్ష ప్రజా ప్రతినిధులు రాజకీయాలు పక్కన పెట్టి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఉపాధి నిధులతో పనులు చేపట్టడానికి అవకాశం లేని చోట మండల పరిషత్, జడ్పీ నిధులతో చేపట్టేందుకు కలిసి రావాలని సూచించారు. నియోజకవర్గంలో రహదారులు అభివృద్ధి కూడా చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు శాంతారాం, కనకమ్మ, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, టీడీపీ పట్టణ నాయకులు దేవరపల్లి వెంకట అప్పారావు, సకురు కోటేశ్వరరావు, స్థానిక నాయకులు మెంబర్ శ్రీను, కందర్ప శంకర్, కార్తీక్, దేముడు, గూనూరు మూలునాయుడు, కర్రి రమేష్, ఎంపీటీసీ సభ్యుడు పెంటరెడ్డి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వడ్డాది బాలికల వసతిగృహం భవన నిర్మాణ పనులపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే రాజు

వడ్డాది బాలిక వసతిగృహం భవన పనులను పూర్తిచేయండి

బుచ్చెయ్యపేట: వడ్డాది జడ్పీ హైస్కూల్‌లో బాలికల వసతి గృహం నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ఈఈ నరసింగరావును చోడవరం ఎమ్మెల్యే రాజు ఆదేశించారు. మంగళవారం వసతి గృహం భవనాన్ని ఆయన పరిశీలించారు. మిగిలిన పనులపై ఈఈతో సమీక్షించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 95 శాతం మేర పూర్తయిన బాలికల వసతి గృహం నిర్మాణ పనులు, వైసీపీ ఐదేళ్ల పాలనలో మూలకు చేరాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, కూటమి నాయకులు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టీడీపీ వడ్డాది అధ్యక్షుడు దొండా నరేష్, దాడి సూర్యనాగేశ్వరరావు, హెచ్ఎం శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.



మహాజన సభలో మాట్లాడుతున్న సంస్థ ఎండీ కోన సరోజ

మహిళలకు వికాస సంస్థ సహకారం

చోడవరం, జూలై 30: వికాస బ్యాంకు ద్వారా గ్రామీణ ప్రాంతంలో మహిళలకు మరింత సహకారం అందిస్తామని సంస్థ ఎండీ కోన సరోజ ప్రకటించారు. మంగళవారం పట్టణంలో వికాస పరస్పర సహకార పొదుపు సంఘం 25వ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కార్యకలాపాలను బ్యాంకు సేవల వివరాలు ఎండీ వెల్లడించారు. మహాజన సభకు ప్రముఖ న్యాయవాది గొర్లె కృష్ణవేణి, కనకమహలక్ష్మి, కో ఆపరేటివ్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు మేనేజర్, సబ్బవరం జాగృతి మ్యాక్స్ ఎండీలు హాజరయ్యారు. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం కొత్త అధ్యక్షురాలిగా కోడూరు నాగమణి, డైరెక్టర్లుగా దాడి కృష్ణవేణి, మాడిసి వెంకట లక్ష్మి, బొడ్డు ఈశ్వరమ్మలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మృతి చెందిన సంఘం సభ్యుల కుటుంబాలకు ఆర్థిక సహకారం కింద బీమా చెక్కులను పంపిణీ చేశారు.

ఉపాధి పనులు కల్పించాలని కూలీల నిరసన

రోలుగుంట, జూలై 30: ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలని మంగళవారం కొరుప్రోలు గ్రామస్థులు జాబ్ కార్డులతో నిరసన తెలిపారు. గ్రామంలో పది కుటుంబాకులకు చెందిన ఆదివాసీ కొందు గిరిజనులు జీవనం సాగిస్తున్నారన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ కింద వారు సాగు చేసుకోవడానికి ప్రభుత్వం రాయితీలు కల్పించాలని కోరారు. అలాగే మట్టి రోడ్డుతోనే అవస్థలు పడుతున్నామని, ప్రభుత్వం స్పందించి పక్కా రోడ్డు నిర్మించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు గెమ్మిలి సుబ్బారావు, కొండబాబు, సీపీఎం నాయకులు నేత కె.గోవిందరావు తెలిపారు.

సమగ్ర శిక్షాభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

బుచ్చెయ్యపేట, జూలై 30: సమగ్ర శిక్షాభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ చోడవరం ఎమ్మెల్యే రాజుకు వినతిపత్రం అందచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 ఏళ్లుగా ఉద్యోగ భద్రత లేకుండా, తక్కువ వేతనాలతో 25 వేల మంది పనిచేస్తున్నారన్నారు. పెరిగిన ధరలతో కుటుంబ పోషణ భారంగా మారడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు జరిగేలా కృషి చేయాలని సంఘ నేతలు అనంతకుమార్, శ్రీను, వెంకటరావు, కామలక్ష్మి, శివకుమారి, పోలిరాజు, రమణబాబు తదితరులు ఎమ్మెల్యే రాజును కోరారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

» టాస్క్‌ఫోర్స్ టీమ్ ప్రతినిధులు



విద్యార్థినులతో మాట్లాడుతున్న టీమ్ ప్రతినిధులు

రావికమతం, జూన్ 30: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ ప్రతినిధులు, డీపీఎంవో లూసికార్డియా, ఎస్‌వో రామచంద్రరావు, డీపీహెచ్‌వో జగదీష్, డీపీహెచ్ఎన్‌వో నాగమణి సూచించారు. తట్టబంద హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను మంగళవారం బృందం సందర్శించి రికార్డులను పరిశీలించారు. హెల్త్ క్లినిక్ ద్వారా వైద్య పరీక్షలు ఏ విధంగా నిర్వహిస్తున్నది ఆరా తీశారు. గర్భిణులు, కిశోర్ బాలికలకు రక్తహీనత వల్ల జరిగే నష్టాలను వివరించారు. హెల్త్ సెంటర్ నిర్వహణ, తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది హేమసుంద్రరావు, సత్యనారాయణ, ఆదిలక్ష్మి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలి: డిప్యూటీ డీఈవో

రోలుగుంట, జూలై 30: విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని డిప్యూటీ డీఈవో అప్పారావు సూచించారు. మండలంలోని రోలుగుంట, శరభవరం, కొంతలం, కొవ్వూరు పాఠశాలలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ బోధనపై ఆరా తీశారు. పలు అంశాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం కొంతలం జడ్పీ పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించి నాణ్యత ప్రమాణాలపై ఆరా తీశారు. అలాగే రోలుగుంటలో భవిత కేంద్రం సందర్శించారు. ఎంఈవో జగ్గారావు పాల్గొన్నారు.

బల్లిపురంలో రహదారిపై కూలిన చింత చెట్టు

దేవరాపల్లి, జూలై 30: కాశీపురం-చింతలపూడి రోడ్డులో బల్లిపురం వద్ద చింత చెట్టు కూలిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు చెట్టు ఒక్కసారిగా పడిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ రాజబాబు, ఉప సర్పంచ్ మహేషు, యువకులు చెట్టును తొలగించారు.

నేడు ఎంపీపీగా బుల్లి లక్ష్మి ప్రమాణ స్వీకారం

దేవరాపల్లి, జూలై 30: ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి బుధవారం ప్రమాణ స్వీకారం చేస్తారని ఎంపీడీవో ఎస్.అప్పరాజు తెలిపారు. కిలపర్తి రాజేశ్వరీ రాజీనామా చేయడంతో, వైస్ ఎంపీపీగా ఉన్న లక్ష్మికి బాధ్యతలు అప్పగించినట్టు ఆయన చెప్పారు.

టెన్త్‌లో ఉత్తమ విద్యార్థులకు నగదు పురస్కారాలు

కె.కోటపాడు, జూలై 30: టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన చౌడువాడ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్థానికుడు నరసింహరాజు ప్రోత్సాహకాలు అందించారు. పాచిల లోష్టవి, తరుణ్, కృష్ణంరాజులకు నగదు ఇచ్చారు. మాజీ వైస్ చాన్సలర్ ముత్యాలనాయుడు, ఎంఈవో-1, 2లు కె. సత్యనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

మాడుగుల

నియోజకవర్గం

మోదకొండమ్మను దర్శించుకున్న పాడేరు ఎమ్మెల్యే

మాడుగుల, జూలై 30: స్థానిక మోదకొండమ్మ అమ్మవారిని పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు పర్యవేక్షణలో దంగేటి సూర్యారావు, భీమరశెట్టి పైడయ్యనాయుడు, నానాజీ వారిని ఆహ్వానించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి జ్ఞాపికను అందించి శాలువాతో సత్కరించారు. అంతకు ముందు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు కుటుంబ సభ్యులతో కలిసి 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించారు.

ఉడుపు యంత్రంతో నాట్లు వేసుకోవడం మేలు

కె.కోటపాడు, జూలై 30: ఉడుపు యంత్రం ద్వారా వరి నాట్లు వేసుకోవడం ఎంతో మేలని వ్యవసాయాధికారి సోమశేఖర్ సూచించారు. రొంగలినాయుడుపాలెం గ్రామంలో కర్రి మనోజ్‌బాబు పొలంలో ఉడుపు యంత్రంతో నాటుతున్న పొలాన్ని మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ యంత్రం ద్వారా మొక్కలకు, వరసకు మధ్య దూరంతో నాట్లు వేయవచ్చన్నారు. దీనివల్ల మొక్కలకు గాలి, వెలుతురు తగిలి బాగా ఎదుగుతాయన్నారు. దుబ్బుకు 60 నుంచి 80 పిలకలు వస్తాయని, ఖర్చు ఆదా అవుతుందని వివరించారు. వీఏఏలు కృష్ణవేణి, సుధీర్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

మాడుగుల, జూలై 30: చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని న్యాయవాది శ్రీనాథు ప్రసాదరావు సూచించారు. డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ సమాజంలో జరిగే అన్ని విషయాలపై అవగాహన అవసరమన్నారు. నైపుణ్యాన్ని బట్టి ఉద్యోగాలు వస్తాయని, అడ్డగోలుగా ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ చెప్పిన మాయమాటలు నమ్మి ధనం దుర్వినియోగం చేసుకోవద్దని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ దామోదర్‌నాయుడు, మాజీ సర్పంచ్ సూర్యారావు పాల్గొన్నారు.

వీరవల్లి అగ్రహారంలో మోదకొండమ్మకు పూజలు

మాడుగుల రూరల్, జూలై 30: మండలంలోని వీరవల్లి అగ్రహారంలో కొలువైన మోదకొండమ్మ అమ్మవారు మంగళవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లుతో అమ్మవారిని అలంకరించి, పురోహితులు భరణిశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఎల్‌బీ పట్నంలో పారిశుధ్య పనులు

చీడికాడ, జూలై 30: మండలంలో ఎల్‌బీ.పట్నం గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించారు. పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్త, మురుగునీటిని ఎక్స్‌కవేటర్‌తో పంచాయతీ కార్యదర్శి రాజాన ప్రసాద్ తీయించారు. గ్రామస్థులు చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వీరభద్రునిపేటలో వైద్య శిబిరం

చీడికాడ, జూలై 30: మండలంలోని వీరభద్రునిపేట గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం జరిగింది. చీడికాడ పీహెచ్‌సీ పరిధిలోని 18 మంది వచ్చి వైద్య సేవలు పొందారు. వీరిలో ఇద్దరికి జ్వరాలు ఉన్నట్టు గుర్తించారు. హెల్త్ అసిస్టెంట్ పెంటకోట పేరునాయుడు రోగులకు తనిఖీలు చేసి, అవసరమైన మందులను అందజేశారు. ఈ శిబిరంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.